# ప్రతిపక్షాలకు ఓటేయొద్దు

**ఖైరతాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దానం నాగేందర్**



ఫిలింనగర్ రోడ్ నం.9లోని దుర్గాభవానీ నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న ఖైరతాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్

బంజారాహిల్స్, నవంబర్ 20: పేదల అవసరాలు, కష్టాలు గుర్తించి సంక్షేమ పథకాలు అందజేస్తున్న బీఆర్ఎస్ పార్టీని ఆదరించాలని, కాంగ్రెస్, బీజేపీలకు ఓటేస్తే నష్టపోతారని ఖైరతాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని జ్ఞానీజైల్ సింగ్‌నగర్, స్వామి వివేకానంద నగర్, అంబేద్కర్‌నగర్, దీన్ దయాళ్‌నగర్, బీజేఆర్‌నగర్, పటేల్‌నగర్ బస్తీల్లో కార్నర్ మీటింగ్స్ నిర్వహించారు. ఈ సమావేశాల్లో దానం నాగేందర్ పాల్గొని మాట్లాడారు. రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్‌వన్‌గా తీర్చిదిద్దిన సీఎం కేసీఆర్‌ను మరోసారి గెలిపించాలని కోరారు. పేదలకు అండగా నిలబడాలనే లక్ష్యంతో జీవో 58 కింద ఉచితంగా ఇండ్ల క్రమబద్ధీకరణ, మంచినీటి సమస్య పరిష్కారం, 24 గంటల కరెంట్, ఉచితంగా మంచినీటి సరఫరా, ప్రతి వీధికి రోడ్లు, డ్రైనేజీల సామర్థ్యాన్ని పెంచడం లాంటి పనులను చేపట్టామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్, మాజీ కార్పొరేటర్ కాజా సూర్యనారాయణ, బీఆర్ఎస్ రాష్ట్ర నేత అర్షద్ నవాబ్, మామిడి నర్సింగరావు, కాటూరి రమేశ్, భవానీ రమేశ్, నర్సింహ ముదిరాజ్, జగన్, ఉపేందర్, పర్వతాలు, శ్రీను, అశోక్, పద్మ, విజయలక్ష్మి, చంద్రమ్మ, రాములమ్మ, ధనమ్మ, మంజుల పాల్గొన్నారు. కాగా బండారు బాల్‌రెడ్డినగర్‌కు చెందిన బీజేవైఎం డివిజన్ అధ్యక్షుడు వంగర చేతన్‌కుమార్ అలియాస్ నానితోపాటు పెద్ద సంఖ్యలో బీజేపీ కార్యకర్తలు దానం నాగేందర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.



మేడ్చల్ మండలంలోని సోమారం గ్రామంలో ప్రచారంలో మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి

# కాంగ్రెస్ మాటలు నమ్మితే ఆగమే..

- ఆలోచించి ఓటేయండి
- కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి
- మేడ్చల్ మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం

మేడ్చల్ రూరల్, నవంబర్ 20 : కాంగ్రెస్ మాయమాటలు నమ్మి ఆగం కావొద్దని.. అభివృద్ధిని చూసి ఓటేయాలని బీఆర్ఎస్ మేడ్చల్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్ మండలంలోని సోమారం, ఎల్లంపేట, సైదోనిగడ్డ తండా, రావల్‌కోల్ గ్రామాల్లో సోమవారం మంత్రి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్నర్ సమావేశాల్లో మంత్రి మాట్లాడుతూ.. తండాలు, పల్లెలను సీఎం కేసీఆర్ పంచాయతీలుగా మార్చడంతో అవి అభివృద్ధి దిశలో పయనిస్తున్నాయని తెలిపారు. గిరిజనులు స్వయం పాలనతో తండాలను బాగు చేసుకున్నారని, ఆధునిక గ్రామ పంచాయతీ భవనాలు, కమ్యూనిటీ భవనాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేసుకుని ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. మేడ్చల్ నియోజకవర్గంలో ఘనమైన అభివృద్ధి చేశామని, తనను మరోసారి గెలిపించాలన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే వచ్చి మాయమాటలు చెప్పే వారి మాటలు నమ్మొద్దని, 50 ఏండ్ల పాలనలో కాంగ్రెస్ ప్రజలకు చేసిందేమి లేదన్నారు. ఓ విజన్‌తో పని చేస్తూ ప్రజల కష్టాలు తీర్చిన సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని మరోసారి బలపరిచి, ప్రతి ఒక్కరూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రజితా రాజమల్లారెడ్డి, జడ్పీటీసీ శైలజా విజయనందరెడ్డి, జిల్లా రైతు బంధు సమితి అధ్యక్షుడు నందారెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, డివిజన్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా సోమారం గ్రామానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీల యువ నాయకులు 50 మంది మంత్రి మల్లారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. అలాగే పీర్జాదిగూడలోని ఎంకేబీఆర్ హాలులో కార్పొరేటర్ శశిరేఖ బుచ్చియాదవ్ ఆధ్వర్యంలో యాదవుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి మల్లారెడ్డి, మేయర్ వెంకట్‌రెడ్డితో కలిసి హాజరై మాట్లాడారు.

# ప్రజలే నా బలం.. నా బలగం

**కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**



బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరుతూ కారు గుర్తును చూపిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

బాలానగర్, నవంబర్ 20 : ప్రజాభిమానమే నా బలం.. నా బలగం అని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. సోమవారం ఫతేనగర్ డివిజన్‌లో కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్‌తో కలిసి ఆయన రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం పని చేస్తున్నదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రోడ్లు వేశామని, తాగునీరు, కరెంట్ కష్టాలు తీర్చామని ప్రజలకు వివరించారు. ఉమ్మడి పాలనలో విద్యుత్ కోతలు, రైతుల ఆత్మహత్యలు మినహా అభివృద్ధి శూన్యమన్నారు. ఇండ్లులేని నిరుపేదలకు సొంతింటి కల నెరవేర్చడం కోసం డబుల్ బెడ్‌రూం పథకాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆడబిడ్డల పెండ్లికి సాయం అందించడం కోసం కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకాలను సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు అందించారా? ప్రజలు గమనించాలని సూచించారు. గౌతంనగర్‌లో ప్రారంభించిన రోడ్ షో ఆల్విన్ సొసైటీ, భగత్‌సింగ్ పార్క్, ఫతేనగర్ మెయిన్‌రోడ్డు, హరిజబస్తీ, పార్థీ బస్తీ, శివాలయం రోడ్డు, దీన్‌దయాల్‌నగర్, సమతానగర్, జింకలవాడ, ప్రభాకర్‌రెడ్డి నగర్, భరత్‌నగర్ కాలనీల మీదుగా సాగింది.

# అన్ని వర్గాల సంక్షేమానికి కృషి

**ముషీరాబాద్ అభ్యర్థి ముఠా గోపాల్**



గాంధీనగర్ ప్రచారంలో మాట్లాడుతున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి ముఠా గోపాల్

చిక్కడపల్లి, నవంబర్ 20 : బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే అన్ని వర్గాల సంక్షేమానికి న్యాయం జరుగుతున్నదని ముషీరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి ముఠా గోపాల్ అన్నారు. ప్రచారంలో ప్రజల నుంచి మంచి స్పందన వస్తున్నదని, ఈ ఎన్నికల్లో భారీ మెజార్టీతో విజయం సాధిస్తానని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సోమవారం గాంధీనగర్ డివిజన్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అభ్యర్థి ముఠా గోపాల్ మాట్లాడుతూ... 24 గంటల పాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించానని, మరోసారి తనను ఆశీర్వదించాలని కోరారు. గడిచిన ఐదేండ్లలో సీఎం కేసీఆర్ సహకారంతో కోట్లాది రూపాయలతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు ముఠా జయసింహ, డివిజన్ అధ్యక్షుడు ఎం.రాకేశ్‌కుమార్, డివిజన్ ఇన్‌చార్జిలు అజయ్ ముదిరాజ్, బొట్టు శ్రీను,మాజీ కార్పొరేటర్లు ముఠా పద్మ, పద్మజ, బీఎన్ శ్రీనివాస్ యాదవ్, నరేశ్, శ్రీనివాస్‌గుప్తా, శ్రీనివాస్, రవి శంకర్ గుప్తా,రాజ్‌కుమార్, కిరణ్, సత్యనారాయణ, రవి, శ్రీధర్‌రెడ్డి, చాణిక్య రెడ్డి, భాస్కర్, హన్మంతు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# మాధవరం కృష్ణారావును గెలిపించండి

**ఏఐఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ**



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

అల్లాపూర్, నవంబర్ 20 : పదేండ్ల నుంచి హైదరాబాద్‌లో ఎలాంటి హిందూ, ముస్లిం గొడవలు కానీ..కర్ఫ్యూలు కానీ లేవని ఏఐఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. అల్లాపూర్ డివిజన్ పరిధిలోని యూసుఫ్‌నగర్ చౌరస్తాలో జరిగిన బహిరంగ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ముస్లింలందరికి అందుతున్నాయని, అందుకే తాము బీఆర్ఎస్ పార్టీకి మద్దతు తెలుపుతున్నామని స్పష్టం చేశారు. ఎంఐఎం అభ్యర్థులు లేని చోట బీఆర్ఎస్‌కు సపోర్టు చేయాలని కోరారు. విదేశీ విద్య, రంజాన్ సందర్భంగా ముస్లింలకు కానుకలు, దావత్‌లు సైతం ఏర్పాటు చేయటం గర్వించదగ్గ విషయమన్నారు. మసీదులలో పనిచేసే ఇమామ్, మౌజమ్‌లకు వేతనాలు అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఎంఐఎం పార్టీ తరపున బీఆర్ఎస్ అభ్యర్థి మాధవరం కృష్ణారావుకు తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబీహాబేగం, ఏఐఎంఐఎం పార్టీ నాయకులు,బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఐటీ అడ్డాలో గులాబీ జెండా ఎగిరేస్తాం

**ఎమ్మెల్యే అభ్యర్థి గాంధీ**



హైదర్‌నగర్ డివిజన్‌లో శేరిలింగంపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి గాంధీకి హారతులిస్తున్న మహిళలు, చిత్రంలో కార్పొరేటర్ శ్రీనివాస్‌రావు

మియాపూర్, నవంబర్ 20: ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో, అభివృద్ధి పనుల్లో నంబర్‌వన్‌గా ఉన్న ఐటీ ప్రాంతంలో ముచ్చటగా మూడోసారి గెలిచేది గులాబీ జెండాయేనని శేరిలింగంపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి అరెకపూడి గాంధీ స్పష్టం చేశారు. కుల, మతాలకు అతీతంగా దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలు నివసించే మినీ భారత్‌గా నియోజకవర్గం ప్రసిద్ధి కెక్కిందన్నారు. హైదర్‌నగర్ డివిజన్ పరిధిలో కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్‌రావు సహా పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులతో కలిసి విప్ గాంధీ సోమవారం పలు కాలనీల్లో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విప్ గాంధీ మాట్లాడుతూ.. నవంబర్ 30న కారుగుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. మంత్రి కేటీఆర్ దత్తత తీసుకున్న ఈ డివిజన్‌లో వందల కోట్ల నిధులను వెచ్చించి ఎన్నో అభివృద్ధి పనులను చేపట్టినట్లు, రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామని గాంధీ పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ , మంత్రి కేటీఆర్ సహకారంతో రూ. 9 వేల కోట్లకు పైగా నిధులతో విస్తృతమైన అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను గడపగడపకు తీసుకెళ్లి ప్రజలు కారు గుర్తుకు ఓటు వేసేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పార్టీ శ్రేణులు, మహిళా నేతలు, ఆయా కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.